నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు!

- కియోస్క్ స్థానంలో యాప్ ఏర్పాటు
- అరకొర సేవలతో నామమాత్రంగా యాప్
- కియోస్క్ సేవలను పునరుద్ధరించాలంటున్న రైతన్నలు

కొల్లిపర: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా.. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అనేక సేవలను ఇంటి వద్దకే అందించారు. ఎరువులు, పురుగుమందుల కొనుగోలు.. రైతులు పండించే వివిధ రకాల పంటలపై వారికి వచ్చే సందేహాలు వెంటనే ప్రయోగాత్మకంగా కియోస్క్ యంత్రాల ద్వారా వివరించేవారు. అటు వంటి ప్రస్తుతం కియోస్క్ పరికరాలు ఇప్పుడు పనిచేయడం లేదు. ఫలితంగా అవి కార్యాలయంలో మూలకు చేరాయి. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి, రైతు సేవల కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నీరుగార్చేందుకు కంకణం కట్టుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను రద్దు చేయడమే కాకుండా.. మరి కొన్నింటికి పేర్లు మార్చింది కూటమి ప్రభుత్వం.

కియోస్క్ ద్వారా ఎన్నో సేవలు..

రైతులకు వారి గ్రామంలోని నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ కేంద్రాలల్లో రైతులకు అవసరమైన ఎరువులు, మందులు, పంటకు ఆశించే చీడపీడల నివారణకు సలహాలు, వివిధ రకాల సేవలకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా అక్కడికి వెళ్లిన రైతులకు దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ పంటల యాజన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నన్నారు.



కొల్లిపర ఆర్‌బీకేలో నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

మండలంలో 15 ఆర్‌బీకేలు..

కొల్లిపర మండల పరిధిలో 20 గ్రామాలకు గానూ 15 గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఆర్‌బీకేల్లో 15 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న పరికరాలు ఎటువంటి సేవలనూ నోచుకోవడం లేదు. కాగా అధికారులు మాత్రం వాటిని అప్పుడప్పుడూ వాటిని వినియోగిస్తున్నామని చెబుతుండడం గమనార్హం.

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు..

కియోస్క్ పరికరాల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను గత ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రస్తుతం యంత్రాలు నిరుపయోగంగా ఉండడంతో పాటు.. యాప్‌లోని సేవలు కూడా అరకొరగా అందుతున్నాయని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలలో తిరిగి సేవలందించాలని రైతులు కోరుతున్నారు.

> **కియోస్క్ సేవలను కొనసాగించాలి..**
>
> రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలను కొనసాగించాలి. గతంలో ఎరువులు, పురుగుమందులు నమోదుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు కియోస్క్ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అలా ఉపయోగపడే సేవలను తిరిగి కొనసాగించాలి.
>
> – ఎ.రాజశేఖరరెడ్డి, రైతు, కొల్లిపర

క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



తెనాలి: కరెంటు ఛార్జీల భారంతో సతమతమవుతున్న వినియోగదారులపై స్మార్ట్ మీటర్లు బిగించి మరింత దోపిడీ చేయడానికి ప్రభుత్వం సిద్ధపడుతోందని.. ఈ చర్యలను ప్రజలు వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ముఖ్యమంత్రికి పంపే వినతిపత్రంపై మంగళవారం రూరల్ మండల గ్రామం గుడివాడలోని సచివాలయంలో సంతకాల సేకరణ చేయించారు. కార్యక్రమంలో బండి సుధాకర్, జ్యోతుల కోటేశ్వరరావు, బురదగుంట భాస్కరరావు, మత్తే రాజారావు, బండి మార్క్, జ్యోతుల బాబు, జ్యోతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



తెనాలి రూరల్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ హెచ్చరించారు. రూరల్ గ్రామం నందివెలుగులో 1.73 ఎకరాల డొంక పోరంబోకు అన్యాక్రాంతం అయిన ఘటనపై సర్వే జరిపి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా డొంక పోరంబోకును ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి ఉన్నారని, రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే జరిపిన అనంతరం ప్రభుత్వ భూమిగా నిర్ధారించి దానిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జగన్‌మోహనరావుకు సన్మానం



తెనాలి అర్బన్: అమెరికాలోని కాలిఫోర్నియా మ్యూజిక్ అకాడమీ పిలుపు మేరకు త్వరలో అక్కడ వెళ్లనున్న అభ్యుదయ కళాసమితి ప్రతినిధి తాడికొండ జగన్‌మోహనరావు అభినందన సభను మంగళవారం గాంధీ నగర్‌లోని ఇస్కఫ్ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ వేత బి.లలితానందప్రసాద్, మున్నిపల్లి రఘునాథరావు, బెల్లకొండ వెంకట్, శ్రీదేవి, అనురాధ, నీలాంబరం, విజయసారథి, మౌనిక, లక్కరాజు లక్ష్మణరావు, బొల్లిముంత కృష్ణ, మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ ఆర్‌హెచ్‌సీలో అందుబాటులో వైద్య సేవలు



తాడికొండ: మెడికల్ కళాశాల అనుబంధంగా కొనసాగుతున్న తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి అన్నారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రంలో నూతనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం, అభివృద్ధి చేసిన రక్త పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గురువారం గర్భిణులకు స్కానింగ్ సేవలు అందించబడతాయని, తాడికొండ, పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఆర్‌హెచ్‌సీలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సివిల్, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయని, ఆవరణను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో సేవలందించడం జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నళినీదేవి, డాక్టర్ పూర్ణమ్మ, డాక్టర్ శివగోపాల్, డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, డాక్టర్ ఇన్నారావు, పొన్నెకల్లు పీహెచ్‌సీ, ఆర్‌హెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవసాయ భూములకు రీ సర్వే

చుండూరు(వేమూరు): ప్రభుత్వ వ్యవసాయ భూములను రీ సర్వే చేశామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మంగళవారం చుండూరు మండలం చినపరిమి గ్రామంలో రీ సర్వే 13వ నోటిఫికేషన్ గజెట్ ప్రచురింప చేశారు. అనంతరం ఆయన రీ సర్వే కాపీని రైతులకు చదివి వినిపించారు. రైతుల సందేహాలను నివృతి చేశామని నాగరాజు అన్నారు.

‘మార్పు’ లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

తెనాలి: తక్కువ సమయంలో తక్కువ బడ్జెట్‌తో పెద్ద సందేశాన్ని అందించే లఘు చిత్రాలు నేటి వేగవంతమైన జీవితాలకు ఎంతైనా అవసరం అని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, విశ్రాంత బ్యాంకు అధికారి సాయి లక్కరాజు అన్నారు. స్థానిక బాలాజీరావుపేటలో అరుణా ప్రొడక్షన్స్ పతాకంపై హరిబాబు నిర్మిస్తున్న ‘మార్పు’ లఘు చిత్రం తొలి షాట్‌కు మంగళవారం సాయి లక్కరాజు దర్శకత్వం వహించి క్లాప్ నిచ్చారు. సందేశాత్మకమైన కథలతో నిర్మించే లఘుచిత్రాలు నేటి ప్రపంచానికి అవసరమన్నారు. కృష్ణకిషోర్ అందించిన కథను వెంకీ దర్శకత్వంలో తీస్తున్న ఈ చిత్రం షూటింగ్‌లో నటీనటులు ప్రియాంక, స్వీటీ, సైదులు, శాంతి, లక్ష్మణరాజు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు తెనాలి, పరిసరాల్లో చిత్రీకరించి ఇదే నెలలో విడుదల చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



క్లాప్ ఇస్తున్న సాయి లక్కరాజు

జీవిత బీమాతో ఖాతాదారులకు రక్షణ

ఫిరంగిపురం: జీవిత బీమా బ్యాంకు ఖాతాదారులకు రక్షణగా నిలుస్తుందని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం రిజర్వు బ్యాంకు సౌజన్యంతో ల్యాంప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవీలపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ మానవ జీవితానికి రక్షణగా పీఎం జీవన్‌జ్యోతి, పీఎం సురక్ష వంటివి నిలుస్తాయని చెప్పారు. ఖాతాదారు రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్‌పాల్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు సక్రమంగా వినియోగించుకుంటే వ్యాపార రంగంలో అభివృద్ధిని సాధించుతారని చెప్పారు. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రిజర్వు బ్యాంకు సేవలు తెలిపే పుస్తకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో వెలుగు కో ఆర్డినేటర్ డి.ద్వారక, పారిశ్రామికవేత్త వి.భాస్కర్, కె.వెంకటేశ్వరరావు, బాజీ, తురకా మంగయ్య, యానిమేటర్లు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలించిన జెడ్పీ సీఈవో

తాడికొండ: మండలంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పొన్నెకల్లు, తాడికొండ గ్రామాల్లో ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించిన ఆయన పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడుతుందని, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించి విడివిడిగా చెత్తను అందించేలా అలవాటు చేయాలన్నారు. అనంతరం సేకరణపై ప్రజలతో మాట్లాడి.. చెత్తను సేకరిస్తున్నారా లేదా దీని వలన ప్రయోజనంగా ఉందా అని అడిగారు. ఆయన వెంట ఎంపీడీవో కె.సమతావాణి, ఈవోఆర్డీ శివలీల, కార్యదర్శులు రమణయ్య, జానీ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బాపట్ల: వాలీబాల్ పోటీల్లో బాపట్ల పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గోవాలో గత నెల 26, 27 తేదీల్లో జరిగిన 15వ జాతీయ యువజన వాలీబాల్ క్రీడా పోటీల్లో ప్రథమస్థానం పొందడం ఎంతో గర్వకారణమని శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులను అభినందించారు. పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న దిలీప్, కె.మోహన్, ఏ.వైభవ్, కె.కార్తీక్, షేక్ రెహాన్, హెచ్.సంతోష్, ఎం.సాత్విక్ అనే విద్యార్థులను సన్మానించారు. విద్యతో పాటు క్రీడా రంగంలోనూ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ముందంజలో ఉంటున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ మానవ నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు, పి.చంద్రశేఖరరావు, డాన్స్ సెక్రటరీ వెంకయ్య, ట్రెజరర్ కోటా వీరబ్రహ్మయ్య, బాపట్ల పబ్లిక్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.సుబ్బరామయ్య, సూపరింటెండెంట్ శ్రీధర్, పీఈటీలు అన్వర్ బాషా, రాజేష్‌లు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు

చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

భట్టిప్రోలు: గతేడాది జాతీయ చేనేత దినోత్సవ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల నిరసన దీక్షలలో భాగంగా ఆయన ప్రచారం నిర్వహించి భట్టిప్రోలు మండలంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన భట్టిప్రోలు రథం సెంటర్‌లో చేనేత కార్మికుల నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి దీక్ష ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, అఖిలపక్ష పార్టీ, అనుబంధ చేనేత కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మర్రివాడ వెంకట్రావులు ముఖ్యఅతిథులుగా విచ్చేయనున్నట్లు వివరించారు. చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సత్యనారాయణ

పాఠశాలలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు

తెనాలి: సమాజసేవలో ఒక నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్న సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, వాసవి క్లబ్ సభ్యులు అభినందనీయులని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. ఆయా సంస్థల స్థానిక నరేంద్రదేవ్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పైపులైన్, కుళాయిలు, సింకులను మంగళవారం తహసీల్దార్ ప్రారంభించారు. సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంకిపాటి రమేష్‌కుమార్, బి.సుధాకర్, ఆలపాటి కామేశ్వరరావు, డి.సత్యనారాయణ, ఏవీ సాంబశివరావు, ఓ.మార్కండేయులు, రామకృష్ణారెడ్డి, మణికాంత్, అబ్దుల్ హకీమ్ జానీ, ఆలపాటి శివకుమార్, వెచ్చా నాగరాజురావు, మాడ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

తెనాలి అర్బన్: టీబీ ముక్తా భారత్ అభియన్‌కు సంబంధించిన సర్వేను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్ రమాదేవి సూచించారు. ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాంలో భాగంగా గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్, కొలకలూరులోని పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సర్వేకు సంబంధించిన విధి విధానాలను ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్ కుమార్, ఎంపీహెచ్‌వోలు రాజయ్య, వెంకటరెడ్డి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు



మంగళగిరి: పారిశుద్ధ్య కార్మికుల శ్రమను టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ దోచుకుంటున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.రవి విమర్శించారు. కార్మికులకు రూ.15 వేల జీతాన్ని మున్సిపాల్టి ఇస్తుంటే.. రూ.10 వేలు మాత్రమే కార్మికులకు ఇచ్చి రూ.5 వేలు కాంట్రాక్టర్ దోచుకుంటున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోనే చాలీచాలని జీతాలతో కార్మికులు బతుకుతున్నారని, వారినే దోచుకుంటున్నారంటే ఇక మిగిలిన విభాగాలలో ఎంత అవినీతి జరుగుతుందో ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేయడంపై మంగళవారం మంగళగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేషన్, ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.బాలాజి, నారాయణమ్మ, రజని, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలి

భట్టిప్రోలు: శ్రీ లక్ష్మీ అమ్మవారు ఐశ్వర్య ప్రధాయిని అని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్, మహిళా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ, బొల గాని విజయలక్ష్మిలు పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులైన మాజీ జెట్పీటీసీ సభ్యురాలు బండారు కుమారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ధర్మ రక్షా బంధన్ కార్యక్రమాలు ధార్మిక సమితి ఆధారంగా నిర్వహించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పరియోజన ప్రముక్ పడమట వెంకటేశ్వరరవు, జిల్లా ప్రభుత్వ సంబంధాల ప్రముఖ బొలగాని వెంకటేశ్వర్లు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, మండల కన్వీనర్ వేల్పూరి నివాసరావు, బూర్లె అరుణ కుమారి, పసుపులేటి శ్రీలక్ష్మి, వేల్పూరి అనసూయ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఉపయోగించుకోవాలి

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర యాప్ ద్వారా ప్రవేశ పెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మార్కెట్ మీదుగా గాంధీ చౌక్ వరకూ ర్యాలీ కొనసాగింది. గాంధీ చౌక్‌లో మానవ హారం నిర్వహించి వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక సంఘం అందించే వివిధ రకాల సేవలను వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. అవసరమైన వారు సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఆర్పీలు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి

కొల్లిపర: తమ ఇంటికి, పొలానికి స్మార్ట్ మేటర్‌లను బిగించవద్దని.. బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని కోరుతూ కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం గ్రామ సచివాలయంలో సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం స్మార్ట్ మేటర్లు బిగించినట్లయితే రూ.9 వేల నుంచి రూ.18 వేల వరకు వినియోగదారుడికి కరెంటు బిల్లు వస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం బాగున్న మీటర్లను తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని ఆయన కోరారు. అదాని కంపెనీకి మేలు చేసేందుకే ఈ ఒప్పందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: స్మార్ట్ మీటర్ల పంపిణీని పూర్తిగా నిలిపివేయాలని జిల్లా ప్రజా ఐక్యవేదిక నాయకుడు బి.భవన్నారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల ప్రజావేదిక ఆధ్వర్యంలో చెంచుపేటలోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలని కోరారు. అనంతరం ఏడీఈ బోరుగడ్డ అశోక్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బి.ప్రసాద్, నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, అహ్మద్ హుస్సేన్, వై.అశోక్ కుమార్, జి.వి.సుబ్బయ్య, సీహెచ్ శేషగిరిరావు, కె.శ్రీనివాసరావు, చినవెంకట్రావు, మోహన్, చిన్ని, పి.జోసేష్, కె.శంకరరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎం.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పారిశుద్ధ్య సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

తెనాలి అర్బన్: ఎన్ని సంవత్సరాలు అయిన పారిశుద్ధ్య నిర్వహణలో పూర్తిస్థాయిలో మార్పురావడం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాలుగో వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రోడ్లపై వ్యర్థాలు ఉండడాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో ఎందుకు వ్యర్థాలను సేకరించడం లేదంటూ సిబ్బందిని ప్రశ్నించారు. పనితీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

‘పొలం పిలుస్తోంది’లో రైతులకు అవగాహన

వేమూరు: జింక్ లోపం ఉంటే వరి ఆకులపై తుప్పు మచ్చలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ అన్నారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జింక్ లోపం నివారణకు జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన, కోనేటిపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయశాఖాధికారి బి.బ్రహ్మారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచులు రాయన ప్రసాదరావు, మండవ రామకోటేశ్వరరావు, ఏఈవోలు లక్ష్మి ప్రసన్న, వాగోలు బుష్, అఖిల, వీఏఏలు రత్నరాజు, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): రైతులందరూ ఖరీఫ్ సీజనలో ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలం పాంచాలవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. వెద పద్ధతి సాగు చేస్తున్న పొలాల్లో ఇనుప ధాతు లోపాలు గమనించి అన్నభేది నిమ్మ ఉప్పు పిచికారీ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవీంద్రబాబు, పి.సువర్ణరావు, డి.మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



చావలి కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి



పల్లెకోన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



పాంచాలవరం గ్రామంలో హేమంత్ భరత్

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

అమర్తలూరు(వేమూరు): గ్రామ పంచాయతీల్లో పైప్‌లైన్‌లకు లీక్‌ల మరమ్మతులు చేశామని డిప్యూటీ ఎంపీడీవో జొన్నలగడ్డ వినయబాబు తెలిపారు. అమర్తలూరు గ్రామ పంచాయతీ తాగు నీరు పైపు లైను లీక్ కావడంతో మంగళవారం మరమ్మతులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పైపు లైనులు లీక్ అయితే తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు.

నేటి సంస్కరణ సభను జయప్రదం చేయాలి

చుండూరు(వేమూరు): చుండూరు దళిత మృతవీరుల సంస్కరణ సభను బుధవారం చుండూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు చుండూరు దళిత పోరాట కమిటీ అధ్యక్షులు జాలాది మోజెస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం రక్త క్షేత్రం వద్ద అమర వీరులకు నివాళులర్పించి దళిత మృత వీరుల సంస్కరణ సభ నిర్వహించనున్నామని.. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.